క్లుప్తంగా

మిథున్‌రెడ్డికి త్వరగా బెయిల్ రావాలి

- ప్రత్యేక పూజలు చేసిన సమన్వయకర్త కృపాలక్ష్మి



కనకదుర్గమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు వెళుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: వైఎస్ఆర్ సీపీ నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో బెయిల్ త్వరగా రావాలని, ఆయన ఆరోగ్యంగా ఉండాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి కోరారు. గురువారం ఆమె విజయవాడలో ఇంద్ర కీలాద్రిపై వెలసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కర్పూర హారతులు పట్టారు. ప్రస్తుతం దుష్ట శక్తులు ఆవహించిన రాష్ట్రాన్ని కాపాడాలని కోరుకున్నట్లు వెల్లడించారు. అమ్మవారికి ఫల, పుష్పాలతో కూడిన సారెను సమర్పించారు.

మున్సిపాలిటీకి రూ.2.84 లక్షల ఆదాయం

పుత్తూరు: శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక అంగళ్ల నిర్వహణ కోసం గురువారం నిర్వహించిన వేలం పాటల ద్వారా మున్సిపాలిటీకి రూ.2.84 లక్షల ఆదాయం వచ్చిందని కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తెలిపారు. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే తాత్కాలిక అంగళ్ల నిర్వహణను డి.అశోక్‌కుమార్ దక్కించుకొన్నట్లు తెలిపారు.

ఉన్నత పాఠశాలకు వంట పాత్రలు



వంట పాత్రలు అందజేస్తున్న వినోద్‌నాయుడు

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం ఉన్నత పాఠశాలకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వంట పాత్రలను విరాళంగా అందజేశారు. వరత్తూరు పంచాయతీ కనికాపురం గ్రామానికి చెందిన వినోద్‌నాయుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. గురువారం తూగుండ్రం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రనాయుడుకు రూ.15వేలు విలువ చేసే వంట పాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేంద్రనాయుడుతోపాటు విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, ఉపాధ్యాయులు చంద్రమనాయుడు, దేవరాజులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మహిళా డాక్టర్‌ను నియమించండి

ఐరాల: స్థానిక పీహెచ్‌సీలో మహిళా డాక్టర్‌ను నియమించాలని వైద్యాధికారి రెడ్డెప్ప గురువారం పాలకలలో ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీలో మహిళా డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్ణలత మెటర్నిటీ సెలవులో ఉన్నారని, దీంతో ఓపీతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి తానే వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. పాలకల ఆయుష్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్ వాణిని ఇక్కడికి బదిలీ చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

భక్తులకు అన్నదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం ఆషాఢ అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవర్లకు అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దాత పార్థసారథినాయుడు భక్తులకు అన్నదానం చేశారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్(కాణిపాకం): సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ కారణంగా సీజనల్ ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా తదితర వ్యాధుల వ్యాప్తిపై శ్రద్ధ వహించాలన్నారు. పల్లెల్లో పర్యటిస్తూ.. సీజనల్ వ్యాధుల కట్టడికి సమష్టిగా పనిచేయాలన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డును విధిగా నిర్వర్తించాలన్నారు. టీబీ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, వైద్యులు సుదర్శన్, ప్రవీణ పాల్గొన్నారు.

పూల సాగు.. ఆదాయం బాగు





సాగులో ఉన్న వెల్‌వెట్ పూలతోట, (ఇన్‌సెట్) బంతి పూలతోట

సంప్రదాయ పంటలతో నిత్యం నష్టపోతున్న రైతులు ఇప్పుడు ఇతర పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. కొత్తరకం పూలసాగులో అధిక లాభాలు వస్తుండడంతో వీటిపై రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. ఆడి నెలల్లో మార్కెట్‌లో పూలకు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది రైతులు పూల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా చెరుముందరకండ్రిగ గ్రామంలో విరివిగా పూలు సాగు చేస్తున్నారు. –పాలసముద్రం

- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

చెరుముందరకండ్రిగ గ్రామంలో 200 పైగా కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలోని ప్రజలు కష్టపడి పంటలు సాగు చేసి ముందుకు ఎదుగుతున్నారు. రైతులు వరి, చెరకు పంటలు సాగు చేసి అప్పుల పాలైపోయారు. రెండు సంవత్సరాలుగా ఇక్కడి భూముల్లో వివిధ రకాల పూల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణంగా బంతి, నాటు చామంతి, మల్లిపూలు, కనకాబరం సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది హైబ్రీడ్ వెల్‌వెట్, హైబ్రీడ్ చామంతి, కొత్తగా పసుపు, తెలుపు రంగుల గులాబీ పూలను సాగు చేస్తున్నారు. ఉదయం తోటలోని పూలను కూలీలతో కోసుకుని తమిళనాడులోని తిర్తుతణి, వేలూరు, చైన్నై మార్కెట్లకు తీసుకెళ్లుతున్నారు. ఇలా చేయడంతో పూలకు మంచి గిరాకీ ఉన్నప్పుడు వ్యాపారస్తులే తోట వద్దకు వచ్చి ముందుగా అడ్వాన్స్ ఇచ్చిపోతున్నారు. ఇలా మండల పరిధిలో శుభ కార్యాలయాలకు కూడా ఇక్కడకు వచ్చి పూలను తీసుకెళ్తున్నారు. పూల సాగుతోనే చెరుముందరకండ్రిగ గ్రామ రైతులు లాభాల బాటలో నడుస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ఇక్కడ సాగు చేసిన పూలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. పండుగ సీజన్‌లో బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులే ఇక్కడికి వస్తున్నారు. తోటల వద్దనే కొనుగోలు చేసి తీసుకెళ్లుతారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో మరిన్ని కొత్తరకం పూలు సాగు చేయడానికి గ్రామంలో రైతులు ఆసక్తి చూపుతున్నారు.



కొత్తరకం మ్యారీగోల్డ్ పూలతోట

మార్కెట్‌లో మంచి గిరాకీ

ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్న పూలనే ఎంచుకుని సాగు చేస్తున్నారు. హైబ్రీడ్ చామంతి, వెల్‌వెట్ సాగుకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. మ్యారీగోల్డ్, మ్యారీ పింక్ సాగుకు ఎకరానికి రూ.90 వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతుంది. ఎకరా భూమికి 10 నుంచి 12 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. నర్సరీల్లో 10 వేల మొక్కల ధర రూ.25 వేలు నుంచి రూ.29 వేలు, బాడుగతో సహా రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఎరువులు, దుక్కులు, కూలీలు, పురుగు మందుల ఖర్చులు కలుపుకుంటే గరిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.90 వేలు వరకు ఖర్చు అవుతుంది. మంచి దిగుబడి వస్తే ఎకరానికి ఐదు టన్నుల పూలు కాస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో హైబ్రీడ్ చామంతి, గులాబీ పూల ధరలు కిలో రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. మల్లెలు, కాకడ పూలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది, కనకాంబరం కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ధరలు పలుకుతున్నాయి. దీపావళి, ఆడి నెల, కార్తీక మాసాల్లో పూల ధరలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పండగ సీజన్‌లో కిలో పూలు రూ.150 వరకు పలుకుతాయి.

మల్లెల సాగుతో లాభాలు



చెరుముందర కండ్రిగలో ఎకరా మల్లెపూల తోట సాగు చేశాను. ఖర్చు రూ.50 వేలు అవుతుంది. ఆదాయం లక్షన్నర వస్తుంది. ప్రతి రోజు పూల తోటలో పూలు కోసుకుకెళ్లి తిరుత్తణి, చెన్నై మార్కెట్‌కు ఎగుమతి చేస్తున్నాను. కిలో మల్లెమొగ్గలు రూ.65 నుంచి రూ.75 ధర పలుకుతాయి. రోజుకి సుమారు 25 కిలోల పూలు తీసుకెళ్లుతాను. రోజు కూలీకి పోను రూ.వెయ్యి వస్తుంది.

–వడివేలురెడ్డి, చెరువుముందర కండ్రిగ

మ్యారీగోల్డ్, గులాబీ సాగు చేస్తున్నాం



మాకున్న భూముల్లో మ్యారీగోల్డ్, గులాబీ పూల తోట సాగు చేస్తున్నాను. రెండు బోర్లు వేశాను. నీరు రాకపోవడంతో వరి, చెరకు సాగు చేయకుండా ఉన్న తక్కువ నీటిలోనే ఎకరాకు పైగా పూలు సాగు చేస్తున్నా. ఆదాయం బాగానే వస్తుంది. కొత్తరకం పూలు సాగు చేస్తే తోట వద్దకే వ్యాపారులు వచ్చి పూలను తీసుకెళ్లుతారు. మాగ్రామంలో ప్రతి ఒక్కరు పూల సాగుపైగా ఆధారపడి ఉన్నాం.

–మత్యాలురెడ్డి, చెరువుముందరకండ్రిగ

పూల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం



మండలంలో అన్ని గ్రామాల్లో పూల తోటల సాగుపై హార్టికల్చర్, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నాం. అయితే చెరుముందరకండ్రిగ గ్రామంలోని రైతులు పూలతోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా వివిధ రకాల పూలతోటలు సాగు చేసి, ఆదాయం పొందుతున్నారు.

–ఢిల్లీప్రసాద్, మండల వ్యవసాయాధికారి

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): అగ్నిప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి రమణమూర్తి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొడ్ల డెయిరీ ఆధ్వర్యంలో అగ్ని, విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్న వెంటనే ప్రమాదం చోటు నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలని, మంటల్లో కాలిపోయే వస్తువును మంటలకు దూరంగా ఉంచాలని తెలిపారు. వాటిని నీటితో తడపాలని సూచించారు. గ్యాస్ స్టవ్‌ల మంటల నుంచి ఎలా బయటపడాలి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు క్షుణ్ణంగా వివరించారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ సుకుమార్, సుధాకర్, జనార్ధన్, రవికుమార్, వెంకటరమణ, కోటేశ్వరరావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక సామగ్రి పంపిణీ



నోటు పుస్తకాల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు మండలం తాళంబేడు, బీఎన్ఆర్‌పేట, పచ్చనపల్లి, తుమ్మింద గ్రామాల్లో గురువారం పుస్తక సామగ్రి పంపిణీ చేపట్టారు. జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలోని వందలాది పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, ఇతర పుస్తక సామగ్రిని అందించారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



సుదర్శన్‌నాయుడు కుమార్తెను ఓదారుస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



కస్తూరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: మండల పరిధిలో ఇటీవల మృతి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం పరామర్శించారు. వైఎస్ఆర్ సీపీ మాజీ మండల కన్వీనర్ సుదర్శన్‌నాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మేళపట్టు గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి సుదర్శన్ నాయుడు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీటి పర్యంతమైన ఆయన కుమార్తెను ఓదార్చారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు సుందరం తల్లి కస్తూరమ్మ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీబాబు, నాయకులు బుజ్జిరెడ్డి, భాస్కర్ రెడ్డి, లీలారాం, ప్రకాష్, యేసు, జయరామ్, రంగనాథం , ఏలుమలై రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామదాసు, నాగరాజు, జయకుమార్, మూర్తి, నాగభూషణం పాల్గొన్నారు.

ఘనంగా వీఎస్ఆర్ పుట్టినరోజు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి(వీఎస్ఆర్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు సేవ కార్యక్రమాలు చేశారు. తొలుత జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు కలిసి కేక్ కట్ చేశారు. నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ ఆధ్వర్యంలో నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం చేశారు. శంకరయ్యగుంటలో నాయకులు అన్బు ఆధ్వర్యంలో అన్నదానం, లెప్రసీ ఆశ్రమంలో దుస్తుల వితరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ గుడిపాల అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు ఇరువారం డేవిడ్, మధురెడ్డి, నౌషద్, నవాజ్‌లు పాల్గొన్నారు. సంతపేటలో మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో చామంతి, సురేష్, సద్దాం, సెల్వరాజ్, రవి, కరీం, ముఖేష్, ప్రకాష్, షాన్వాజ్, అక్బర్, కార్తీక్, సిరాజ్, వెంకటసాయి, ప్రేమ్‌చంద్, కృష్ణకాంత్, అల్తాఫ్, లోకేష్, వసంత్ మొత్తం 40 మంది రక్తదానం చేశారు. అనంతరం సంతపేట, జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేశారు. పార్టీ చిత్తూరు రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ చిత్తూరు మండల అధ్యక్షుడు జయపాల్, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, సర్పంచ్ త్యాగరాజు, అమర్‌నాథరెడ్డి నాయకులు శేఖర్, స్టాండ్లీ, వేలుస్వామి తదితరులు పాల్గొన్నారు. రెడ్డి సంఘం కార్యాలయంలో నాయకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదానం చేశారు. మార్కెట్‌చౌక్‌లోని జైహింద్ పాఠశాలలో పిల్లలకు కోఆప్షన్ సభ్యుడు అను పిల్లలకు పుస్తకాలు, పెన్స్ అందజేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో దొడ్డిపల్లె శివ, అగ్రహారం సత్య, గణేష్, తిలక్‌ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రామ్‌నగర్‌కాలనీలో ఇమ్రాన్, సంతపేటలో బాల, ఢిల్లీ, మనోజ్, మౌళిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వన్నియర్ బ్లాక్‌లో శివ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గాయత్రీదేవి, హరిణిరెడ్డి, అంజలిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మురళీరెడ్డి, మనోజ్‌రెడ్డి, భాస్కర్, జనార్ధన్, ప్రతిమారెడ్డి, చాన్‌బాషా, నారాయణ, కృష్ణారెడ్డి, వెంకటేష్, అప్పాజీ, త్యాగ, బాబు, జీకే, శిరీష్‌రెడ్డి, హేమారెడ్డి పాల్గొన్నారు.



అన్బు ఆధ్వర్యంలో వృద్ధులకు బట్టలు పంపిణీ



సంతపేటలో జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువత

సారా రహిత జిల్లా సాధనే లక్ష్యం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

నగరి: నాటుసారా రహిత చిత్తూరు జిల్లా చేయడమే లక్ష్యమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయశేఖర్ అన్నారు. గురువారం తనిఖీ నిమిత్తం నగరి ఎక్సైజ్ స్టేషన్‌కు ఆయన విచ్చేశారు. ఎక్సైజ్ పరిధిలోని కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే తిరుపతి జిల్లాలో నాటు సారా పూర్తిగా నిర్మూలించామని, నాటు సారా రహిత జిల్లాగా తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రకటించారన్నారు. దానిని అలాగే కొనసాగించేందు అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాను సారా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచించామన్నారు. జిల్లాలో ఇప్పటికే 52 సారా తయారీ గ్రామాలను గుర్తించామన్నారు. వాటిలో 35 గ్రామాల్లో మండల, గ్రామ కమిటీల ద్వారా నిరోధక చర్యలు చేపట్టామన్నారు. ఆగస్టు 2వ తేది లోపు చిత్తూరు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే నవోదయం 2.0లో జిల్లావ్యాప్తంగా 148 కేసులు నమోదు చేసి 185 మందిని అరెస్టు చేశామన్నారు. 1702 లీటర్ల నాటుసారా పట్టుకున్నామని, పర్మిటెడ్ జాగరీవాష్ 48030 లీటర్లు సీజ్ చేశామన్నారు. నాటుసారాకు వినియోగించే బెల్లం 580 కేజీలు పట్టుకున్నామన్నారు. రూ.2.57 లక్షల మేర జరిమానా కూడా వసూలు చేసినట్టు తెలిపారు.

మార్పు కోసమే బైండోవర్లు

తహశీల్దార్ల సమక్షంలో ఐడీ కేసుల్లో 492 మందిని, బెల్లం తయారీదారులు ఇద్దరిని బైండోవర్ చేశామన్నారు. నాటు సారా మానేసి ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు వచ్చిన వారిని 230 మందిని గుర్తించామని, వారికి పశువులు, గొర్రెలు, ఆటోలు అందించాలనే వివరాలు జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. బైండోవర్ చేసినా ఉల్లంఘించి మళ్లీ నేరాలు చేసిన 12 మందిని గుర్తించామని, వారికి కఠిన శిక్ష ఉంటుందన్నారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.క్రిష్ణకిషోర్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బి.సుబ్రమణ్యం, నగరి ఇన్‌స్పెక్టర్ పీటీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మండల ఎస్సీ సెల్ కన్వీనర్ శ్యామ్



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఢిల్లయ్య, పవన్, నాయకులు

శ్రీరంగరాజపురం: వైఎస్ఆర్ సీపీ చిత్తూరు సమన్వయకర్త, మాజీ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని వారి స్వగ్రామం 49 కొత్తపల్లిమిట్టలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఢిల్లయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు మాట్లాడుతూ విజయానందరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం సహకారంతో గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కోటార్లపల్లి గ్రామం వద్ద స్మార్ట్ టీవీ పరిశ్రమను నెలకొల్పారన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, జిల్లా అధికార ప్రతినిధి కోదండయ్య, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, నాయకులు పవన్, స్కలై, మణి, సుధ, యుగంధర్, కోటిరెడ్డిబాబు, దేవరాజులురెడ్డి, జనార్దన్, దొరస్వామి, చొక్క గోవిందయ్య, శేషాద్రి, మార్కొండయ్య, నీలమ్మ, సీకే, బాబు, బిగ్‌బాస్, హరిరెడ్డి, గోవిందయ్య, దొరస్వామి, మాధవ, రఘు, మహేష్, బాబు, అబురు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా వ్యయాన్ని అదుపు చేయాలి

- మోటార్లకు చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు రూ.90.65 లక్షలు : డీఈ
- వసూలు కావాల్సిన నీటి పన్ను రూ.2.25 కోట్లు : కమిషనర్
- సమ్మర్ స్టోరేజ్ నుంచి సరఫరా చేస్తే ఖర్చులు తగ్గుతాయన్న కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నగరి: నీటి సరఫరాకు చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలే దాదాపు రూ.కోటి ఉందని అధికారులు చెప్పడం మున్సిపల్ అత్యవసర సమావేశంలో చర్చనీయాంశమైంది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కమిషనర్ కృష్ణారెడ్డి నిర్వహించిన మున్సిపల్ అత్యవసర సమావేశంలో నీటి సరఫరాకు అయ్యే ఖర్చుల అంశమే ప్రాధాన్యతను సంతరించుకుంది. అధికారులు సిద్ధం చేసిన అజెండాలో ఏపీఎస్‌పీడీసీఎల్‌కు ఉన్న బకాయిలు రూ.90.65 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం కోరారు. దీనిపై కౌన్సిలర్లు మాట్లాడుతూ విద్యుత్ బిల్లు అధికంగా ఎందుకు వచ్చింది, ఇందులో కామన్ ఈటీపీ ప్లాంటుకు అయ్యే బిల్లులు కలిపేశారా అంటూ ప్రశ్నించారు. దీనిపై డీఈ రవీంద్రారెడ్డి సమాధానమిస్తూ తాగునీటి బోర్లకు అమర్చిన మోటార్లకు చెల్లించాల్సిన బిల్లులే ఇంత బకాయి ఉందన్నారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయంలో నీటికి అయ్యే బిల్లులు చెల్లించడానికే ఇంత ఖర్చయితే ఇతర నిర్వహణ పనులు ఎలా చేపడుతారన్నారు. సత్రవాడ వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి అందరికీ నీటి సరఫరా చేస్తే బిల్లులు తగ్గుతాయన్నారు. దీనిపై కమిషనర్ సమాధానమిస్తూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నీరు అందని ప్రాంతాల్లోనే బోర్లు వాడుతున్నామన్నారు. ఇరవయ్యేళ్లకు ముందు కొన్న పాత మోటార్లే వినియోగంలో ఉన్నాయని, అందుకే ఎక్కువ విద్యుత్ వినియోగం అవుతోందన్నారు. వాటి స్థానంలో కొత్త మోటార్లు త్వరలో వస్తాయని, అవి బిగిస్తే చాలావరకు బిల్లులు తగ్గుతాయన్నారు. నీటిని వినియోగించుకుంటున్నా పలువురు నీటిపన్ను చెల్లించడం లేదని ఆ బకాయిలే రూ.2.25 కోట్లు ఉన్నాయన్నారు. అవి వసూలైతే ఈ ఖర్చులన్నీ వాటితోనే చెల్లించవచ్చన్నారు. వార్డుల్లోని ప్రజలు నీటిపన్ను చెల్లించే విధంగా కౌన్సిలర్లు సహకారం అందించాలన్నారు. ట్రేడ్ గ్రాంట్ కింద రూ.1.33 కోట్లు మంజూరయ్యాయని, వీటిలో రూ.66.62 లక్షలు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు, రూ.66.62 లక్షలు నీటి సరఫరాకు వినియోగిస్తామన్నారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ సచివాలయాల్లో స్టేషనరీ లేదని, ప్రింటర్లు పని చేయడం లేదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే జనసంచారం ఉన్న ప్రాంతాల్లో పందులు ఎక్కువగా తిరుగుతున్నాయని, పలుమార్లు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.